# క్షీరసాగర మథనం

"అమ్మా కాఫీ. అర్జంట్ ప్లీజ్.." ఇంట్లోకి అడుగుపెడ్తూనే అలా అరవటం నళినికి ఎప్పుడూ అలవాటు లేదు. కానీ యివాళ్టి అనుభవం కూడా ఎప్పుడు రాదుగా? నళిని అల్మారాలోంచి తలనొప్పి మాత్రొకటి తీసుకుని మంచం మీద వాలి కళ్ళు మూసుకొంది. కానీ కళ్ళ ముందు ఆ వెధవలే.

"ఛీ ఛీ.....నిజాయితీలేని మగాళ్ళు.." చిరాకు పట్టలేక ఆమె పెద్దగానే తిట్టింది.

నళిని అందంగా వుంటుంది. డిగ్రీ వుంది. ఇటీవలే వుద్యోగంలోనూ చేరింది. అయినా ఆడది ఆడదే.

ఆఫీసులో చేరిందగ్గర్నుంచి ఆమె అందాన్ని అంతా పొగిడేవారే, వెర్రిగా వెకిలిగా చూచే వారే....

వారి ద్వందార్థపుమాటలు-వెకిలి చేష్టలు, వెర్రిచూపులు....

అలాంటి లేకి మనుష్యుల్ని ఏ ఆడదైనా ప్రేమిస్తుందా? గౌరవిస్తుందా?

సహించలేక యీ రోజు తనకుగా తాను చొరవతీసుకొంది. వో సీనియర్ క్లర్కును పెళ్ళి చేసుకోమని అడిగింది.

నోరు వెళ్ళబెట్టి, గుడ్లు తేలేసేడు ఆ మహా ప్రేమికుడు!

యిక రోడ్డుమీద రోడ్‌సైడ్ రోమియోలకు లెక్కలేదు. వెధవమొహాలు-వాళ్ళు. వొక్కసారి అద్దంలో మొహం చూచుకోకూడదూ? ఆడదాని వెనుకపడి అల్లరి కూతలు కూయటం ఘనతా? అందునా వొక్క ఆడదాని వెనుక పది మంది వెధవలు. బజారు ప్రేమల్ని ఏ స్త్రీ సహించదన్న ఇంగిత జ్ఞానం అన్నా వుండదేం వీళ్ళకి? వొట్టి నోటి తీట మనుష్యులు!

యివాళ వో రోడ్‌సైడ్ రోమియోని నిలేసింది. అతడు ఆమెకన్నా చిన్నవాడు. ఇంకా డిగ్రీ చదువుతున్నాడు.

"పాపం నన్ను ప్రేమిస్తున్నట్లున్నావ్ కదూ? పెళ్ళి చేసుకుందామా?"

అతను బిక్కచచ్చిపోయాడు. నోట మాట రాలేదు.

"నీకన్నా నేను వయసులో, విద్యలో పెద్దదాన్ననుకో. కానీ ప్రేమకు వీటితో పనేముంది? నీకన్నా నేను మహా అయితే వో ఐదు సంవత్సరాలు పెద్దయి వుండచ్చు. ఫర్వాలేదు. పెళ్ళి చేసుకొందాం. ఏం?" ఆమె అతని చెయ్యి పట్టుకొంది.

అప్పుడు చూడాలి ఆ హీరో అవస్థ!

పేంటు తడిచేసుకొన్నాడు. చెయ్యి వదలించుకొని పరుగోపరుగు!

"ఛీఛీ....వొట్టి కల్తీ మనుష్యులు" ఆమె మంచం మీద నుంచి చిరాకుగా లేచింది.

ఎదురుగా తల్లి! ఆమె చేతిలో కాఫీ కప్పు.

"మనుష్యుల్లో కల్తీ ఏమిటే అమ్మాయ్? కాఫీ పొడుల్లో, పంచదారలో, పప్పుల్లో, పిండుల్లో, పొడుల్లో, నేతిలో, పాలలో కల్తీ విన్నాం కాని మనుష్యుల్లో కల్తీ...యిదేం చోద్యమే!"

"ఆచోద్యం నీకు అర్థం కాదులేమ్మా" అంటూ నళిని తలనొప్పి మాత్ర వేసుకొని కాఫీ తాగింది.

"నీకు శుభవార్త అమ్మాయ్. పెళ్ళిచూపులకు రేపు విజయవాడ నుంచి ఎవరో వస్తామని రాసేరుట! ఈ సంబంధం కుదిరిపోతుందని మీ నాన్న సంబరపడిపోతున్నాడు. పిల్లవాడు..."

ఇలాంటి డైలాగులు నళినికి చాలా పాతవి. కానీ ఆమె తలిదండ్రులకు ఎప్పటికప్పుడు కొత్తగానే కన్పిస్తాయి.

పెళ్ళిచూపులకు ఎవరైనా వస్తున్నారంటే సంబరం, ఆశ, హడావుడి.

చూచి వెళ్ళినవాళ్ళు ఎంతకీ వుత్తరం రాయకపోతే దిగులు, నిరాశ-నిర్వేదం.

ఎన్నిసార్లు ఇలాంటిసీనుల్లో తను పాత్రధారి కాలేదు?

"మళ్ళీ ఎందుకమ్మా ఈ సంత? ఉద్యోగంలో చేరిపోయాగా హాయిగా!"

"ఉద్యోగంలో చేరితే? పెళ్ళి చేసుకోనంటావా ఏమిటి? ఉద్యోగం కడుపు నింపుతుందేమో కానీ ఆడదాని కడుపు పండించగలదుటే! దాంపత్య సుఖాన్ని, సంసార మాధుర్యాన్ని వుద్యోగాలివ్వగలవా? వెర్రిమొర్రి ఆలోచనలు చేయకు. నీలాగ ఇంగిలీషు చదువులు చదవకపోయినా, నాకూ జీవితానుభవం వుంది. పెళ్ళయిందాకా పెద్దలమయిన మా మాట విను"

తల్లి ఖాళీ అయిన కాఫీ గ్లాసు తీసుకొని వెళ్ళిపోయింది. వెళ్తున్న తల్లిని చూస్తూ అలాగే వుండిపోయింది నళిని.

★ ★ ★

చిన్నతనం నుంచి నళినిపై తండ్రి ప్రభావం వుంది.

ఆమె తండ్రి పట్టాభి హైస్కూలు టీచరు. స్కూల్లో, ఇంట్లో కూడా, క్రమశిక్షణకు మారు పేరు. నీతి నిజాయితీలు ఆయనవూపిరి. ఎలాగోలాగు ధనాన్ని ఆర్జించి సుఖించాలన్న తత్వానికి విరోధి. ధర్మబద్ధంగా పొందిన సుఖమే అసలు సిసలు సుఖం అని విశ్వసించాడు.

అంచేత జీవితంలో పెద్దగా ఎదగలేక పోయాడు. భౌతిక సుఖాలను పొందలేక పోయాడు. అందుకాయన ఎన్నడూ విచారించలేదు. తను పొందే మానసిక సుఖం యొక్క విలువ ఆయనకు తెల్సు.

అయితే నళిని పెళ్ళిచేయటానికి, కట్నం ఇవ్వలేని తన అసమర్థత అడ్డం వచ్చినప్పుడు, ఆయన బాధపడ్డాడు.

తన విశ్వాసాల మంచి చెడ్డల్ని గురించి పునరాలోచించబోయాడు. సమాజస్థితిపట్ల కక్షకొద్దీ తనూ సమాజ ప్రవాహపు కాలుష్యంలో కొట్టుకుపోవాలనుకున్నాడు.

"నాన్నా-పది మందికి మార్గం చూపాల్సిన మీరే దారి తప్పటం భావ్యమా?" నళిని కలుగచేసుకొని తండ్రిని మందలించింది.

నళినిది మొదటి నుంచీ అధర్మాన్ని ఎదుర్కొనే స్వభావం. ఎదురుతిరిగితే ఆమె ధాటికెవ్వరూ ఆగలేరు. అలాగని ఆ అస్త్రాన్ని ఎప్పుడూ వుపయోగించదు. స్వతహాగా ఆమె సాధుశీలి.

"ఏం చేయనమ్మా? నా పరిస్థితి చూస్తున్నావుగా?"

"చూస్తునేవున్నానునాన్నా. నలుగురితో పాటు ప్రవాహంలో కొట్టుకుపోవటం తేలికే గదానాన్నా? ధర్మం కోసం, విశ్వాసంకోసం, ఎదురునిలవటానికే ధైర్యం కావాలి. కూతురు పెళ్ళికోసం యివాళ మీ మార్గం మార్చుకోటం పిరికితనం కాదానాన్నా?"

"కన్నతండ్రిగా నేను నెరవేర్చవల్సిన ధర్మం కూడా ముఖ్యమే కదామ్మా?"

"ఆ వ్యక్తిగత ధర్మ నిర్వహణకోసం సమాజ ధర్మాన్ని విసర్జిస్తారానాన్నా? నా మూలంగా మీరు ధర్మభ్రష్టులు కావటం నాకిష్టం లేదు. నా పెళ్ళికి తొందరలేదు. నేను వుద్యోగంలో చేర్తాను."

తండ్రి, నళిని నిర్ణయాన్ని కాదనలేదు. కానీ వుద్యోగం దొరకటం మాత్రం అంత సులభమా?

నళినికి ప్రతిభ వుంది. కానీ అదొక్కటే చాలదుగా?

ఇంటర్వ్యూలకు హాజరయి హాజరయి విసిగిపోయింది. అవినీతి....అశ్రిత పక్షపాతం....చూచిచూచి ఆవేశం పెల్లుబికింది.

"ప్రపంచంలో ప్రసిద్ది చెందిన వింతలెన్ని?" ఆఖరిసారిగా ఆమె హాజరయిన ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్న.

ఆమెకు వాళ్ళ ధోరణికి వళ్ళుమండింది.

"తొమ్మిదంటారు. కానీ గుమాస్తా వుద్యోగానికి పిల్చి ఇంటర్వ్యూలో యీ ప్రశ్న నడగటం పదో వింతగా నేను భావిస్తాను."

ఇంటర్వ్యూ చేసేవారు మొహమొహాలు చూచుకొన్నారు.

ఇక మాట్లాడే అవకాశాన్ని వాళ్ళకివ్వలేదామె-

"ఈ వుద్యోగం, ప్రతిభ తప్ప దిక్కూ మొక్కూ లేని నాలాంటి వాళ్ళకిస్తే అది పదకొండో వింత అవుతుంది. అన్ని వింతల్ని మీరు భరించలేరు. గుడ్‌బై..." అంటూ లేచి చక్కా వచ్చేసింది.

పక్షం రోజుల తర్వాత ఆ వుద్యోగంలో చేరమన్న పిలుపు చూచుకొని ఆమె గర్వించింది.

"యింకా ప్రపంచంలో నీతి నిజాయితీలు పూర్తిగా చావలేదునాన్నా. మనుష్యులందరిలో యుక్తాయుక్త విచక్షణ చావలేదు".

తను ఉద్యోగంలో చేరేకన్నా తండ్రి, పెళ్ళిని గురించి మర్చిపోతాడనుకొన్నది నళిని.

కానీ కూతురు వుద్యోగంలో చేరేక ఆయనలో పెళ్ళి చేయగలనన్న ఆశ మళ్ళీ చిగురించింది. తన కూతురు అందగత్తె, విద్యావంతురాలు. యిప్పుడు ఉద్యోగస్తురాలు కూడా. యిప్పుడు కూడా తను యివ్వలేనంత కట్నం అడుగుతారా?

ఉద్యోగంలో చేరేముందు తను కూడా పెళ్ళిని గురించి మర్చిపోదామనుకుంది నళిని. కానీ, పెళ్ళి అవసరాన్ని పదేపదే తలచుకొనే విధంగా గుర్తుచేసేరు కొందరు- తమ సంసారంలోని మధుర సన్నివేశాలను చెప్పటం ద్వారా...మరి కొందరు వెర్రిమొర్రి వేషాల ద్వారా......

భారతదేశంలోని వివాహవ్యవస్థపట్ల యింకా జనంలో చాలా మందికి గౌరవం వుంది. కనుక వివాహితురాలైన స్త్రీని గౌరవిస్తారు. స్త్రీకి తాళిబొట్టు కవచం లాంటిది. పెళ్ళికాని స్త్రీని అనుభవించే హక్కు ప్రతిఒక్కడూ తనకున్నట్లు భావిస్తాడు.

పైగా తనుకూడా జడురాలేంకాదు. సంసార జీవితంపట్ల తనకి విముఖత్వం లేదు. ప్రకృతిసిద్ధంగా పొందవలసిన ఆ అనుభవాన్నుంచి తనెందుకు దూరం కావాలి?

అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ నళిని మెల్లగా నిద్రలోకి జారుకొంది. నిద్రలో ఏమేమో కలలు...

'అమ్మాయి నళినీ, నిద్రపోతున్నావా? భోజనం చేయకుండా నిద్రేమిటమ్మా. లేలే'

తండ్రి లేపుతుంటే ఆమెకు మెలకువ వచ్చింది. మొహంకడుక్కొని తండ్రితో పాటు భోజనం చేసింది.

ఆమెకు యిప్పుడు మనసు, శరీరం కూడా హాయిగా వున్నాయి.

"అమ్మాయ్. మీ అమ్మ పెళ్ళిచూపుల విషయం చెప్పే వుంటుంది. రేపే వస్తున్నారు వాళ్ళు. పిల్లవాడిని నేను చూశాను. చాలా బాగుంటాడు. డిగ్రీ వుంది. ఆస్తిపాస్తులున్న కుటుంబం వాళ్ళది. అబ్బాయి రైల్వేలో వుద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగస్తురాలు, అందగత్తె అయిన భార్య కావాలని కోరికోరి నిన్ను చేసుకుంటున్నాడు. రేపు పెళ్ళి చూపులు. కేవలం లాంఛనం మాత్రమే. అతనికి నీ ఫోటో నచ్చింది. నువ్వు నచ్చుతావు...కట్నకానుకలంటావా... అతనికి నువ్వు, నీకు అతను నచ్చితే అదో పెద్ద సమస్య కాదు. అలాగని ఆ అబ్బాయి నాతో స్వయంగా చెప్పాడు. అతని తల్లి కూడా ఆమాటే అన్నది. అతనికి తండ్రి లేడులే. ఏమ్మా? నాకిప్పుడు పెళ్ళి అవసరంలేదని అనవుగదా?"

"అనను నాన్నా. ఎందుకంటే నాకు వివాహం యొక్క అవసరం తెలుసు కనుక. యింకా వయసు ముదిరితే వివాహం కావటం మరింత కష్టమవుతుంది కూడా. కనుక పెళ్ళిచేసుకోటానికి నా అభ్యంతరం ఏమీలేదు కానీ...అతను....."

"ఆమాటన్నావు. చాలునమ్మా. అతన్ని రేపు చూస్తావుగా?" ఆమె మాటల్ని పూర్తిగావినకుండానే పట్టలేనంత ఆనందంగా అన్నాడు.

★ ★ ★

"అక్కా. బావగారు ఎంత బాగున్నారో తెల్సా?" తమ్ముడు అయిదు నిముషాలకోసారి వచ్చి వూరించసాగాడు.

"మీ అత్తగారు చాలామంచిదే అమ్మాయ్. యింటి విషయాలన్నీ చెప్పుకొంది. రెండు లక్షలు చేసే యిల్లువుందిట విజయవాడలో. యీ సంబంధం కుదిరేలాగే వుంది. నువ్వు అదృష్టవంతురాలివేనే నళినీ' తల్లి వొకటే సంబరపడిపోసాగింది.

యీలోగా నళిని కాబోయే అత్తగారే లోపలికొచ్చింది. నళినిని చూచింది.

"ముత్యంలాగుంది పిల్ల. ఫోటోలో చూచే మావాడు వొకటే మెచ్చుకొన్నాడు. ఫోటోలోకన్నా చాలా బాగున్నావ్. నిన్ను వదుల్తాడా మావాడు? నేను నీలాంటి కోడలు కోసమే యిన్నేళ్ళు ఎదురుచూచాను."

నళినికిదంతా వింతగా కన్పించసాగింది.

కాబోయే కోడల్ని ఏ అత్తగారైనా యిలా పొగుడుతుందా?

అయినా అతను అంత అందగాడా? అందం పట్ల అంత ఆరాధనా భావం కలవాడా? కాకపోతే కట్నాల ప్రసక్తి లేకుండా తనని చేసుకోవటానికి ఎలా ముందుకొస్తాడు?

అతడు తన భర్త అయిపోయినట్లే మనసులో భావించుకొందామె. ఆ భావనతో ఆమెలో సిగ్గు మొగ్గలు తొడిగింది. శరీరం, మనసు అనిర్వచనీయమైన మత్తుతో నిండి పోయింది.

"మళ్ళీ వర్జ్యం అదీ వస్తుందిట. త్వరగా నడవమ్మా..."

నళిని మెల్లగా నడిచివెళ్ళి తనకి నిర్దేశించబడ్డ కుర్చీలో కూర్చుంది. ఎదురుగ్గా 'అతను' కూర్చునివున్నాడని ఆమెకు తెల్సు. అతను తననే చూస్తున్నాడని ఆమెకు ఏదో అనుభూతి చెప్తోంది. అతడిని వొక్కసారి చూడాలని మనసు కోరిక పడ్తోంది. అందరూ అంతగా పొగిడిన అతనెంత అందగాడో?

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

"నాకు తను నచ్చిందమ్మా. నా లైఫ్ పార్టనర్‌గా చేసుకోటానికి నా అభ్యంతరం ఏమీలేదు. కానీ....'

అతనే. అతనే....అంటున్నాడు. అమృత వాక్కులు అవి!

నళినికి క్షణంలో తనకు పెళ్ళయిపోయినట్లు భావన కలిగింది. పెళ్ళికూతుర్ని చేయటం...... పూజ.....మంత్రాలు....మేళతాళాలు.....బెల్లం జీలకర్ర....అక్షింతలజల్లులు... మంగళసూత్రం కట్టటం...తలంబ్రాలు...వొక సీను వెంట వొకటి మనస్సులో తిరిగాయి.

"తన వుద్యోగం పర్మనెంటే గదా?"

తన్మయత్వం నుంచి నళిని కోలుకొనే సరికి వినపడ్డ మాటలివి. అతనే అడుగుతున్నాడు. తండ్రి జవాబులిస్తున్నాడు.

"అయ్యో. పర్మనెంటేనండీ...."

"అయితే ఫర్వాలేదు. మావూరికి బదిలీ చేయించుకోవచ్చు. పెళ్ళయ్యాక ఉద్యోగం చేయటానికి అభ్యంతరం లేదుకదా తనకి?"

"అయ్యో. అభ్యంతరం ఎందుకండి? వేడినీళ్ళకు చన్నీళ్ళు. ఆడపిల్లలంతా యీ రోజుల్లో వుద్యోగాలు చేస్తున్నారుగా?"

"పైగా తను వుద్యోగం చేసే డిపార్టుమెంటు చాలా మంచిది. అనుకొన్న వాళ్ళకల్లా ఆ డిపార్టుమెంటులో వుద్యోగాలు రావు. అదృష్టవంతురాలు మీ అమ్మాయి."

ఏమిటో ఆ అదృష్టం? సేల్స్‌టేక్స్ డిపార్టుమెంటైనా తనది గుమాస్తా వుద్యోగమే కదా?

కొంపదీసి అతని వుద్దేశ్యం....?

"మా రైల్వేలో శ్రమ తప్ప ఫలితం వుండదండీ. తనుపనిచేసే డిపార్ట్‌మెంటులో అవుతే శ్రమలేకుండానే ఫలం దొరుకుతుంది. అటు వున్నతవర్గాలలో పలుకుబడీ, యిటు ఆదాయం...."

కట్నం తక్కువయినా అతను తనను చేసుకొంటున్నది 'అందు'కన్న మాట! ఆమె వుత్సాహం చచ్చింది. అంతవరకు వున్న సిగ్గు తొలిగిపోయింది. మత్తువిడి పోయింది, ఆవేశం వచ్చింది.

"యింతకీ మీ అమ్మాయి కనీసం నా వైపు చూచినట్లన్నా లేదు. నేను తనకి నచ్చాలి గదా?'

ఆమె తలఎత్తి అతనివంక చూచింది.

అతనామెను చూచి నవ్వేడు.

అతను అందంగానే వున్నాడు. ఆ నవ్వు అందంగానే వుంది.

కానీ ఆ నవ్వులో విషపు మరకలు...

ఆ అందం వెనుక బొల్లి మచ్చలు...కుష్టు ఛాయలు...

యిదే భావన తనకు ఎప్పుడో కలిగింది. అవును. యితడిని తనెప్పుడో చూచింది. ఎప్పుడు? ఎక్కడ? ఆమె గత స్మృతులను మథించింది.

క్షారసాగర మథనం అది-

అందులో నుంచి.....

★ ★ ★

ఇంటర్వ్యూకి హైదరాబాద్ వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు-

నైట్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ దొరకలేదని నళిని ఫ్రెండు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో సీటురిజర్వ్ చేయించింది.

"అదీ మంచిదేలే. డబ్బులూ కలిసి వస్తాయి. పైగా పగలంతా రైల్లో కూర్చొని రకరకాల మనుష్యుల్ని చూడవచ్చు. సీట్ రిజర్వ్ అయిందిగా? ఫర్వాలేదు" అనుకొంది నళిని.

వద్దంటున్నా స్నేహితురాలు సెండ్ ఆఫ్ ఇవ్వటానికి స్టేషన్ వచ్చింది. తన సీటు చూచుకొని,

సూట్‌కేస్ అక్కడ పెట్టి పక్కవాళ్ళకు తన సీట్‌ను, సూట్‌కేసును చూస్తుండమని అప్పజెప్పి స్నేహితురాలితో మాట్లాడటానికి ప్లాట్‌ఫామ్ మీదికొచ్చింది. ఎంతకీ తరగని కబుర్లు....

రైలు కదలబోతుండగా కబుర్ల మత్తు వదిలింది. పెట్టెలోకి ఎక్కబోతుంటే జనంతో నిండి వుందది.

తనది రిజర్వేషన్ కంపార్టుమెంట్. కొంపతీసి తను పొరపాటున వేరే జనరల్ కంపార్టుమెంట్ వద్దకు రాలేదుకదా?

లేదు.అదుగో తన సూట్‌కేస్... తన పక్కవాళ్ళు . . . ఎదుటివాళ్ళు . . . కానీ

అదేమిటి తనసీటులో అంతమంది కూర్చున్నారేం?

ఎలాగో తంటాలుపడి పెట్టెలోకి ప్రవేశించింది.

రైలుకదిలింది. కానీతనకికూర్చోటానికి సీట్ ఏదీ?

"ఆ సీట్ ఆ అమ్మాయిదండీ . . . " పక్క వాళ్ళు తనసీటులో కూర్చున్న యువకులతో అన్నారు.

"అలాగా? మేం బోన్‌గిరి దాకానేలెండి. కూర్చోమనండి . సర్దు కొందాం."

ఎక్కడ సర్దుకోవాలి? అప్పటికే ఆరుగురు కూర్చున్న ఆబెంచీ మీద వాళ్ళ మధ్యనా?

"యిలా కూర్చోమ్మా . . . " ఎదుటిసీట్లో ఆమె కాస్తజరిగిజాగా యిచ్చింది నళినికి.

అది రిజర్వుడు కంపార్టుమెంట్‌లాలేదు. అందులో తిరుపతి వెళ్ళే పేసింజర్స్‌వున్నారు చాలామంది.అంతదూరం యిలా క్రిక్కిరిసిన జనంమధ్య . . . హారిబాప్‌రే ఏం ఖర్మ

"టీసీవచ్చి రిజర్వేషన్ లేనివాళ్ళందర్నీదించేస్తాడేమో" అనుకొని వోపిగ్గా అతని రాకకోసం ఎదురు చూసింది నళిని.

నల్లటి ఆకాశంలో తెల్లటి మెరుపులా ప్రత్యక్షమయ్యాడు టీ.సీ. అసలే అజానుబాహువిగ్రహం. అందుకుతగ్గ శరీరఛాయ. పైగా పెదిమలమీద చిరునవ్వు....

"సినిమా హీరో కావల్సినవాడుదారితప్పి టీసీ వుద్యోగంలో చేరినట్లున్నాడు" అనుకొంది నళిని మనుసులో.

క్రిక్కిరిసివున్న జనాన్ని చూసి అతను విసుగును ప్రదర్శించలేదు. పద్మవ్యూహాన్ని ఛేదించే అభిమన్యుడులా గుంపులో చొరబడి టిక్కెట్లు పరీక్ష చేయసాగేడు.

"యిక యిప్పుడు రిజర్వేషన్‌లేని శాల్తీలు లేస్తాయి" అనుకొంది నళిని.

కానీ అతను చాలా టిక్కెట్లు పరీక్షించినా ఎవ్వరూలేవలేదు. అతని వునికినే పెద్దగా పట్టించు కొన్నట్లులేదెవరూ.

రిజర్వేషన్ వున్న టిక్కెట్లు పరీక్షించి ఛార్టులో టిక్ చేసుకొంటున్నాడు. రిజర్వేషన్ లేని టిక్కెట్లను చూచి వో తెల్లకాగితం మీద టికెట్ల నెంబర్లను రాసుకొని 'రూపాయి యివ్వండి' అని మెల్లగా అడిగి

రూపాయి తీసుకొని జేబులో వేసుకొని ముందుకు నడుస్తున్నాడు.

భువనగిరి వచ్చింది. నళిని సీటులో కూర్చున్న వాళ్ళు దిగేరు. యిక తన సీటులో తను కూర్చుందామనుకొంటుండగా రూపాయిచ్చిన మరో యిద్దరు కూర్చున్నారు.

నళినికి కోపం వచ్చింది. టీసీని నిలేసి అడగాలన్న వుద్రేకం కలిగింది. ఆమె సీటులో నుంచి లేచింది.

ఇంతలో ముష్టివాళ్ళిద్దరు పెట్టెలోకి ప్రవేశించారు. అందులో వో గుడ్డివాడు వొక చోట నిలబడి పాటపాడుతున్నాడు. ఆ గుడ్డివాడి భార్య కాబోలు అందరివద్ద కొచ్చి చెయ్యిచాపి "బాబూ గుడ్డివాడు. దరమం సెయ్యండి బాబులూ" అని అడుక్కొంటోంది. జనం అయిదు పైసలు పది పైసలు ఆమె చేతిలో వేస్తున్నారు.

నళినికి చటుక్కున ఏదో స్ఫురించినట్లయింది. అల్లంత దూరంలో వున్న టీసీని చూచింది. టిక్కెట్టు చూచి అతను చేతులు చాస్తూనే వున్నాడు, రూపాయి చేతిలో పడ్తూనే వుంది.

నళినికి వుద్రేకం పోయి నవ్వొచ్చింది.

ముష్టి ఎత్తుకొనే ఆ మనిషికి, యితనికి తేడా ఏమిటి?

ఆ మనిషి చిరిగిన మురికి బట్టల్ని వేసుకొంది. ఇతను పాలిస్టర్ పేంటు షర్టుల్ని, నల్లకోటును తొడుక్కొన్నాడు.

వాళ్ళు ఆకలి తీర్చుకోటం కోసం అడుక్కొంటున్నారు. ఇతను సుఖాల ఆకలిని తీర్చుకోటం కోసం అడుక్కొంటున్నాడు.

వాళ్ళకు అధికారం లేదు. అందువల్ల రైలెక్కటమే దోషం.

ఇతనికి అధికారం వుంది. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేయటమే ఇతని నేరం.

మార్గాలు, లక్ష్యాలు వేరైనా ఇద్దరూ యాచకులే...

సమాజంపైన పేరుకొన్న మలినపు తెట్టలే!

అయితే నళిని ముష్టివాళ్ళను చూచి జాలిపడి తనూ పదిపైసలు దానం చేసింది. కానీ తెల్లబట్టల ముష్టివాడిని అసహ్యించుకుంది.

'మిస్టర్ టీసీ. వాట్ యు ఆర్ డూయింగ్ యీజ్ వెరీ వెరీ నేస్టీ. ఇటీజ్ ఎక్రయిమ్ ఇన్ డిస్ గైజ్....' ఆపుకోలేక విజయవాడ వస్తుండగా ఇంగ్లీషులో అంది.

"కాదు మేడమ్. అది జీవితం. చిన్న చిన్న అడ్జస్ట్‌మెంట్స్. జీవితాన్ని సుఖమయం చేసుకొనే సాధనాలు..." అతను విజయవాడలో దిగిపోతూ ఆమెతో తెలుగులో అన్నాడు.

★ ★ ★

"నాకిలాంటి మనుష్యులంటే అసహ్యం. నేనితడిని పెళ్ళి చేసుకోను" ఆమె ఆవేశంగా అరిచింది.

అంతా ఆశ్చర్యపోయారు. పట్టాభిరామయ్య కంగారుపడ్డాడు. "అమ్మా....ఆ వేశపడ్తున్నావ్" అంటూ కూతురు వద్దకొచ్చాడు.

"ఆవేశం కాదు నాన్నా. నేను మీ కూతుర్ని. నీతి నిజాయితీలకు ధర్మానికి విలువనిస్తాను నేను. కల్తీ మనుష్యుల్ని నే భరించలేను. నిజాయితీతో ముష్టెత్తుకొనేవాడే నా భర్త అయినా సంతోషిస్తానుకాని కల్తీ బ్రతుకులు బ్రతికే ఇలాంటి ముష్టివాడికి నేను భార్యను అయి ఆజన్మాంతం భరించలేను"

"అమ్మా...."

"అవును నాన్నా. తన వుద్యోగధర్మం పట్ల నిజాయితీలేని వ్యక్తి, భార్య పట్ల మాత్రం నిజాయితీగా వుంటాడన్న నమ్మకం ఏమిటి? ఇవాళ అధికారాన్ని కుదవబెట్టి రూపాయలు యాచించే మనిషి రేపు భార్యనే కుదువబెట్టి లక్షలు గడించడన్న గ్యారంటీ ఏమిటి?"

"మిస్ నళినీ...." పెళ్ళి కొడుకు ఆవేశంతో అరిచాడు.

"ఈ ఆవేశం యిప్పుడు కాదు మిస్టర్. నీ ధర్మ నిర్వహణప్పుడు ప్రదర్శించాలి. ఆరు గంటల సేపు నిన్ను పరిశీలించాను ఒకప్పుడు. ఇప్పుడు ఆరగంటలో నీకు నువ్వుగా తేలిపోయావ్. మిస్టర్. దేవదానవులు క్షీరసాగరాన్ని మథిస్తేనే ముందు విషం పుట్టింది. ఆ తర్వాతే అమృతం లభ్యమయింది. ఇక ఆఫ్ట్రాల్ నా వుద్యోగం ఎంత? క్షారసాగరమన్నా కాదు. దాన్ని మథించి అమృతం జుర్రాలని ఆశిస్తున్నావ్ నువ్వు. నీకు చివరికి మిగిలేది పిడుకెడు బూడిదే. గుర్తుంచుకో."

నళిని కుర్చీలో నుంచి లేచింది చివాలున

"అమ్మాయ్...." అంటూ అత్తగారు అడ్డం పడింది.

పాపం, కొడుకు ప్రతాపం తెల్సుకోలేని పిచ్చి తల్లి!

"అత్తయ్యగారూ! కేన్సరు, కుష్టు, ముసలితనం శరీరానికి రావటం సహజం. అందువల్ల ఆ వ్యక్తికే ప్రమాదం. కానీ ఈ జాడ్యాలు మనసుకు, బుద్ధికి వస్తే మొత్తం జాతికే అకాల వృద్ధాప్యం వస్తుంది. అంగవైకల్యం, మరణం, ఆసన్నమవుతాయి. మీ అబ్బాయికి వివాహం ముఖ్యం కాదిప్పుడు. బుద్ధికొచ్చిన ఆ జాడ్యానికి చికిత్స చేయించండి.'

"నాకంతా అర్ధమయిందమ్మా. కానీ నాదొక్క కోరిక. ఆ జాడ్యానికి చికిత్స నువ్వే చేయవచ్చుగదా? క్షారసాగరం లాంటి వాడి మనసును మథించి కనీసం మంచినీరన్నా సాధించవచ్చు గదా? నా సహాయం వుంటుంది. ఏమంటావ్?"

నళిని చేయి పట్టుకొని దీనంగా అర్థించిందామె.

"అలాగంటారా? అయితే మీ యిష్టం." అంటూ ఆమె చేతిలో చెయ్యి కలిపింది నళిని.

స్వాతి మాస పత్రిక - మార్చి 1985